# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 18, జులై 2026


## రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధుడి దారుణహత్య

✻ తల మొండెం వేరు చేసిన హంతకుడు ✻ భయభ్రాంతులకు గురైన స్థానికులు

✻ గొడ్డలితో దాడి చేసి పరారైన గుర్తుతెలియని వ్యక్తి... ✻ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



మసాడే సోమయ్య (ఫైల్)

రెబ్బెన, జూలై 17, ప్రభాతవార్త :

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. పర్స నంబాల గ్రామానికి చెందిన మసాడే సోమయ్య (65) అనే వృద్ధుడిని గుర్తుతెలియని వ్యక్తి గొడ్డలితో దాడి చేసి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.మృతుడి భార్య కరుణాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు లక్ష్మి, సుజాత, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె లక్ష్మి హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. గురువారం ఆమె నంబాల గ్రామంలో నివసిస్తున్న తన సోదరి సుజాత ఇంటికి రావడంతో, పర్స నంబాల గ్రామం నుంచి సోమయ్య, ఆయన భార్య అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులతో గడిపారు.శుక్రవారం ఉదయం లక్ష్మిని తిరిగి హైదరాబాద్‌కు పంపేందుకు సోమయ్య, ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు కలిసి ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో తాను చాయ్ తాగి వస్తానని చెప్పి సోమయ్య రెబ్బెన బస్టాండ్ వైపు వెళ్లాడు. తిరిగి స్టేషన్‌కు వస్తుండగా గుర్తుతెలియని మిగతా 2లో..

## పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

✻ ఘాట్లు, రోడ్లు, తాగునీరు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

✻ కలెక్టర్ భవేశ్ మిశ్రాసోన్, ఖానాపూర్ మండలాల్లో పుష్కర ఘాట్ల పరిశీలన..

✻ ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పరిశీలించిన కలెక్టర్

నిర్మల్, జులై 17, ప్రభాతవార్త:

రానున్న గోదావరి నది పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సోన్ మండలంలోని పుష్కర ఘాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఘాట్ల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు మిగతా 2లో..





## ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, జూలై 17,ప్రభాతవార్త :

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల ఆధీనంలో గల పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి తో కలిసి జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో తరగతి గదుల మరమ్మత్తులు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు, క్రీడా స్థలాల అభివృద్ధి, క్రీడా పరికరాల కొనుగోలు అంశాలను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంతల పనులు చేపట్టాలని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ మిగతా 2లో..



## బ్రాండెడ్ పేరుతో బోగస్ వ్యాపారం...

## తనిఖీల్లో బహిర్గతం

■ మందమర్రిలో నకిలీ జెమినీ ఛాయ్‌పత్తి స్వాధీనం

■ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో వెలుగులోకి ఘటన

■ చట్టపరమైన చర్యలకు రంగం సిద్ధం

మందమర్రి, జూలై 17, ప్రభాతవార్త

మందమర్రి టోల్‌గేట్ సమీపంలోని ఓ ఫుడ్ కోర్టులో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ప్రముఖ బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్న నకిలీ జెమినీ చాయిపత్తి ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్ పోలీసు సిబ్బంది రాజేందర్, సురేందర్ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తనిఖీల సందర్భంగా అసలైన మిగతా 2లో..

## షెడ్యూల్డ్ కులములు, తెగల అభివృద్ధికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలి



✪ రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 17, ప్రభాతవార్త :

జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల వారికి రాజ్యాంగం కల్పించిన చట్టాల ప్రకారం అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్సి, ఎస్టిలకు సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలలోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, గ్రామాలలో మోలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్పి నితికా పంత్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా అటవీ అధికారి బాలమణి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మీ, ఎస్సి, ఎస్టి కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్, కుసుం నీలాదేవిలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో 133627 మంది షెడ్యూల్డ్ తెగలు, 81596 మంది షెడ్యూల్డ్ కులముల వారు ఉన్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం సంక్షేమ పథకాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని, వసతి గృహాలు, గురుకులాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేలా నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, తెగల ప్రజలు నివసిస్తున్న గ్రామాలకు రహదారి సౌకర్యం, త్రాగునీటిని అందించాలని, రహదారి నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు త్వరగా జారీ చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులను త్వరగా విచారించి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు త్వరగా పరిహారం అందించాలని తెలిపారు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో షెడ్యూల్డ్ కులములు, తెగలను ప్రోత్సహించాలని, ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. ప్రతి నెల 30వ తేదీన నిర్వహించే పౌర హక్కుల దినోత్సవానికి మండల స్థాయి అధికారులు తహసిల్దార్, ఎస్ఐలు తప్పనిసరిగా హాజరై ఎస్సి, ఎస్టి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద షెడ్యూల్డ్ తెగలు, కులముల అర్హత గల కుటుంబాలకు 100 రోజుల పని కల్పించాలని తెలిపారు. రెవెన్యూ అటవీ శాఖల మధ్య ఉన్న భూముల వివాదాలను ఉమ్మడి సర్వే నిర్వహించి పరిష్కరించుకోవాలని, ప్రభుత్వ పథకాలలో షెడ్యూల్డ్ కులములు, తెగలకు వారి హక్కుల మిగతా 2లో..



# షెడ్యూల్డ్ కులములు, తెగల అభివృద్ధికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలిపారు. మున్సిపాలిటీలలో పారిశుధ్ధ్య కార్మికులకు పిఎఫ్ అమలు, బీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగలు, కులములవారికి అందవలసిన సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, తెగలవారు నివసించే గ్రామాలలో రహదారి పనులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు అటవీశాఖ అధికారులు త్వరగా అనుమతులు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులను వారి ప్రాంతాలలో ఖర్చు చేసే విధంగా, గిరిజనేతరులు సాగు చేసే పోడు భూముల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, డిఎస్పిలు అశోక్, వహీదుద్దీన్, జిల్లా అధికారులు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధుడి దారుణహత్య

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తి గొడ్డలితో మెడపై బలంగా దాడి చేయడంతో సోమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.సమాచారం అందుకున్న ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, రెబ్బెన సీఐ సంజయ్, ఎస్ఐ వెంకటకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడి ఆచూకీ కోసం రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు. క్లూస్ బృందం, శునక దళం కూడా సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించాయి.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కరుణాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## ఉద్యోగ, కార్మికులకు జీవనోపాధికి తగిన వేతనాలు కల్పించాలి

**- కనీస వేతనం రూ. 26 వేలు, ఇల్లు-పెన్షన్ సహా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతి**

మంచిర్యాల, జూలై 17, ప్రభాతవార్త

జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగాల ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పారిశుధ్ధ్య కార్మికులు, పథకాల సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు తదితరులు అల్ప వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత, బీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే 55 ఏళ్లు పైబడిన కార్మికులకు రూ. 3 లక్షల పదవీ విరమణ ప్రయోజనం, నెలకు రూ. 6 వేల పెన్షన్ ఇవ్వాలని, ఇల్లు లేని పేద ఉద్యోగులు, కార్మికులకు ప్రభుత్వమే ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు, పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కాసల రాజలింగు, మహేందర్, తిరుపతి, దేవావరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జల సంరక్షణపై ప్రభుత్వం ఫోకస్... ఇంకుడు గుంతలు తప్పనిసరి

**300 గజాలకు పైబడిన భవనాలకు కొత్త నిబంధన**

**వర్షపు నీటి సంరక్షణకు మున్సిపాలిటీ పిలుపు**

మందమర్రి, జూలై17, ప్రభాతవార్త

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖజల్ సంచయ్ - జల్ భాగీధారిగ్ఞ కార్యక్రమంను చేపట్టుచున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజలింగు ప్రకటనలో తెలిపారు. మందమరి మున్సిపాలిటీ పరిధిలోనీ 300 చదరపు గజాలు లేదా అంతకంటే ఎక్కువ స్థల విస్తీర్ణం కలిగిన గృహాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, సంస్థల యజమానులు తమ భవన ఆవరణలో వర్షపు నీటి సంరక్షణ ఇంకుడు గుంతలు (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్) తప్పనిసరిగా నిర్మించాలని మున్సిపల్ అధికారులు సూచించారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా తగిన ప్రమాణాలతో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని అధికారులు తెలిపారు. మున్సిపల్ అధికారులు నిర్వహించే తనిఖీల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయని భవనాలు గుర్తించినట్లయితే, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సంబంధిత యజమానులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై వర్షపు నీటి సంరక్షణకు సహకరించి, భూగర్భ జలాల పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

**- సర్పంచ్ కోట వేణుగోపాల్**

కాగజ్‌నగర్ రూరల్, జూలై 17, ప్రభాతవార్త :



గ్రామాభివృద్ధి పనులకు ప్రజల సహకారం తోడైతే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని బారెగూడ గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ అన్నారు. గ్రామంలో చాలా కాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న సైడ్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష ్యంతో రూ.8.60 లక్షల వ్యయంతో మంజూరైన సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు శుక్రవారం మార్క్‌అవుట్ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్తగా నిర్మించనున్న సైడ్ డ్రైన్స్ పూర్తయిన తర్వాత వర్షపు నీరు సులభంగా వెళ్లిపోవడంతో నీటి నిల్వ సమస్య తొలగిపోతోందని, గ్రామంలో పరిశుభ్రతతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని చెప్పారు.గ్రామంలోని ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ లక్ష్యమని, గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని సర్పంచ్ కోట వేణుగోపాల్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేందుకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు. అవసరమైన చోట్ల నిర్మాణాలకు ఆటంకంగా ఉన్న ప్రహరీలను స్వచ్ఛందంగా తొలగించి అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, మాజీ వార్డు సభ్యులు నాగోషే హన్మంతు, మోర్లె గజానంద్, దుర్గం బాపూరావు, కొంరెల్లి అశోక్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులోనూ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణా కార్యక్రమాలను కొనసాగిస్తాం

**- డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి**

కాగజ్‌నగర్ రూరల్, జూలై 17, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోటీ పరీక్షల ఉచిత శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు ఓఎంఆర్ విధానంలో నమూనా పరీక్ష నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను నిరంతరం సాధన చేస్తూ, సిలబస్‌పై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో విజయాన్ని అందుకోవచ్చని సూచించారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల కోసం ఇలాంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జి డా. డి. లక్ష్మినరసింహం మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే సిలబస్‌కు అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలు చదవడంతో పాటు క్రమబద్ధంగా ప్రిపరేషన్ కొనసాగించాలని సూచించారు.అనంతరం కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డా. వి. దేవేందర్ రూపొందించిన ఈమెటీరియల్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. ఇ. శారద, అధ్యాపకులు ఎం. రాజేశ్వర్, టి. దత్తాత్రేయ, కృష్ణవేణి, డా. వి. దేవేందర్, వెంకటేశం, రోజ్ మేరి, బోధనేతర సిబ్బంది సి.హెచ్. సత్యనారాయణ, కిష్టయ్య, ముకుందరావు పాల్గొన్నారు.

## బ్రాండెడ్ పేరుతో బోగస్ వ్యాపారం...

# తనిఖీల్లో బహిర్గతం

(మొదటిపేజీ తరువాయి)

టాటా చాయిపత్తి పేరుతో వినియోగదారులను మోసం చేసే ఉద్దేశంతో నకిలీ ప్యాకెట్లను విక్రయానికి ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని ఫుడ్ కోర్టు నిర్వాహకులను ప్రశ్నించి, ఉత్పత్తుల కొనుగోలు, సరఫరాకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నకిలీ ఆహార ఉత్పత్తుల విక్రయానికి పాల్పడిన వారిపై ఆహార భద్రతా చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, వినియోగదారులు బ్రాండెడ్ ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేసే సమయంలో ప్యాకింగ్ నాణ్యత, తయారీ తేదీ, గడువు తేదీ, ఎంఆర్‌పీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు వంటి వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. నకిలీ ఉత్పత్తులపై అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆహార భద్రత విషయంలో నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, నకిలీ ఆహార ఉత్పత్తులను విక్రయించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలలను విద్యార్థుల సంఖ్య పెంపొందించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, డ్రా బ్యాక్ లో ఉన్న విద్యార్థులను ఆన్లైన్ చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఎఫ్.ఆర్.ఎస్. హాజరు శాతం తక్కువ నమోదుపై కారణాలను తెలుసుకున్నారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా, పోషక విలువలతో పరిమాణంతో కూడిన భోజనాన్ని అందించాలని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలో ప్రతి పాఠశాలను పర్యవేక్షించాలని, ఆపార్ 53 శాతం, ఆధార్ 90 శాతం ఉందని, వీటి శాతాన్ని పెంపొందించాలని, పాఠశాల వివరాలను యు డైస్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలోని 118 ప్రీ ప్రైమరీ పాఠశాలలలో విద్యార్థులను 100 శాతం చేర్పించాలని, మండల విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పుష్కరాల నాటికి ఘాట్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని స్పష్టం చేశారు. గత పుష్కరాల్లో నమోదైన భక్తుల రద్దీని పరిగణనలోకి తీసుకుని అంచనా మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. చేపట్టే పనులన్నీ నాణ్యతతో ఉండాలని ఆదేశించారు. ఘాట్లకు చేరుకునే మార్గాల్లో సూచిక బోర్డులు, పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, భక్తుల భద్రత, పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్, లైటింగ్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ అనిల్, తహసీల్దార్ సంతోష్ పాల్గొన్నారు.

### ఖానాపూర్ మండలంలో పర్యటన - ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పరిశీలన

అనంతరం ఖానాపూర్ మండలంలో పర్యటించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా, అక్కడి గోదావరి పుష్కర ఘాట్లను పరిశీలించి పుష్కరాల నిర్వహణకు ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. భక్తులు ఘాట్లకు చేరుకునేలా రోడ్డు సౌకర్యం, పుణ్యస్నానాలకు అనువుగా ఘాట్లను సిద్ధం చేయాలని సూచించారు. ఆ తర్వాత ఖానాపూర్ పట్టణంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం ఓటర్ల సంఖ్య, సేకరించిన ఫారాలు, ఆన్‌లైన్ వివరాలను అడిగి తెలుసుకుని బీఎల్ఓ యాప్ పనితీరును తనిఖీ చేశారు. నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఫారాలు నింపడంలో బీఎల్ఓలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సోయబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## నాయకత్వ పటిష్టతకు కృషి చేయాలి: మాజీ మంత్రి అల్లోల

### - నూతన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల హరీష్ కుమార్‌కు ఘన సన్మానం

### - పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అహర్నిశలు శ్రమించాలి

భైంసా, జులై 17, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ నాయకత్వ పటిష్టతకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. నిర్మల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన ఆకుల హరీష్ కుమార్‌ను శుక్రవారం ఆయన ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అహర్నిశలు కృషి చేయాలన్నారు. నూతన పట్టణ అధ్యక్షుడు హరీష్ కుమార్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్, కోఆప్షన్ సభ్యురాలు మేడారం అపర్ణ ప్రదీప్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొప్పుల శ్రీధర్, బీసీ సంఘం అధ్యక్షుడు అనుముల భాస్కర్, బీసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు రవి కిరణ్, సంతోష్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




స్కైరూట్ ఇమిగ్రేషన్ కన్సల్టెన్సీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న యువనేత బాజీరావు పాటిల్

## విదేశీ విద్య అభ్యసించే విద్యార్థులకు చక్కని అవకాశం

### - తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడి

భైంసా, జులై 17, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని గోకుల్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్కైరూట్ ఇమిగ్రేషన్ కన్సల్టెన్సీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గ యువనేత బాజీరావు పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్సల్టెన్సీని ప్రారంభించిన అనంతరం నిర్వాహకులు అవినాష్, కదం ప్రవీణ్, సతీష్ పటేల్‌లను ఆయన అభినందించారు. అనంతరం బాజీరావు పాటిల్ మాట్లాడుతూ.. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ప్రాంతీయ విద్యార్థులకు ఈ కన్సల్టెన్సీ ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. తనకు కూడా విదేశాల్లో 10 సంవత్సరాల అనుభవం ఉన్నందున, విదేశీ విద్యను అభ్యసించాలనుకునే అభ్యర్థులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

### మంచిర్యాల ట్రాఫిక్‌కు కొత్త దిశ..

# ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థకు సన్నాహాలు

### - రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యం - కీలక కూడళ్లలో ప్రత్యక్షంగా పరిశీలించిన డీసీపీ భాస్కర్

### - ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి

మంచిర్యాల, జులై 17, ప్రభాతవార్త

పెరుగుతున్న వాహన రద్దీకి అనుగుణంగా మంచిర్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. రామగుండం పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఉప పోలీసు కమిషనర్ భాస్కర్ శుక్రవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లను సందర్శించి ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు, రహదారి భద్రత, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణంలోని ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీ థియేటర్ చౌరస్తా తదితర ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ప్రవాహం, వాహనాల రద్దీ, పాదచారుల రాకపోకలను పరిశీలించిన ఆయన, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఉప పోలీసు కమిషనర్ భాస్కర్ మాట్లాడుతూ, కార్పొరేషన్‌గా వేగంగా అభివృద్ధి చెందుతున్న మంచిర్యాల నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి క్రమశిక్షణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు అనుసంధానమయ్యే ప్రధాన రహదారులు పట్టణం గుండా వెళ్లడం వల్ల కూడళ్ల వద్ద వాహనాల రద్దీ పెరుగుతోందని తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ ఇంజినీరింగ్ నిపుణులతో అధ్యయనం నిర్వహించిన అనంతరం, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో తొలి విడతలో నాలుగు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సిగ్నళ్ల పనితీరు సమర్థవంతంగా ఉండేందుకు స్వేచ్ఛా ఎడమ మలుపులు, రహదారి విభజన స్తంభాలు, ఆగే గీతలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల రహదారి మరమ్మతులు, యూ మలుపుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొన్ని కూడళ్లలో ఐదు, ఆరు రహదారులు కలిసే పరిస్థితి ఉండటంతో ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ట్రాఫిక్ నిర్వహణ చేపడుతున్నామని ఆయన వివరించారు. నగర మేయర్, ఉప మేయర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అందిస్తున్న సహకారంతో ట్రాఫిక్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలు ప్రజల భద్రత కోసమేనని, సిగ్నళ్లను ఉల్లంఘించడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల అమూల్యమైన ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో సహాయ పోలీసు కమిషనర్ ప్రకాశ్, మంచిర్యాల పట్టణ పోలీసు ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనన్, మేయర్ ధరణి మధు, ఉప మేయర్ సల్ల రమ్య, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సిగ్నల్‌లను పరిశీలించిన డిసిపి ఏ. భాస్కర్

## డ్రై డే సందర్భంగా పారిశుద్ధ్య పనుల పరిశీలన

### - సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎంపీఓ ఆదేశం

సారంగాపూర్, జులై 17, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని అలూర్ గ్రామంలో ఎంపీఓ అజీజ్ ఖాన్ శుక్రవారం పర్యటించారు. ఖ్రై డేఖ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్ల పరిసరాల్లో మురికినీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వైరల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున, గ్రామ ఆరోగ్య కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. నిత్యం గ్రామాల్లో అందుబాటులో ఉంటూ, కొన్ని ఇళ్లను సర్వే చేస్తూ ప్రజల ఆరోగ్య పరిస్థితిని గమనించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, ఆరోగ్య కార్యకర్త రాజేందర్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మార్లవాయి గ్రామాన్ని సందర్శించిన ట్రైనింగ్ ఐఏఎస్ అధికారి గోమాసా జాసింత్ జోయెల్

### - హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ విగ్రహాలకు నివాళులు

### - పరిశుభ్రత, పచ్చదనంలో మార్లవాయి ఆదర్శ గ్రామం: ఐఏఎస్ అధికారి ప్రశంస

జైనూర్, జులై 17, ప్రభాతవార్త:

జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామాన్ని ట్రైనింగ్ ఐఏఎస్ అధికారి గోమాసా జాసింత్ జోయెల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీ ఆత్మబంధువు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసుల అభ్యున్నతికి వారు విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో చేసిన విశేష సేవలను కొనియాడారు. అనంతరం గ్రామంలోని డార్ఫ్ రీడింగ్ రూమ్‌ను పరిశీలించి, గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి, పారిశుద్ధం, పచ్చదనం కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ప్రాంగణంలో ఆయన మొక్క నాటారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన సత్కార కార్యక్రమంలో సర్పంచ్ కనక ప్రతిభ ట్రైనింగ్ ఐఏఎస్ అధికారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ.. ఆదివాసీ గ్రామమైన మార్లవాయి పరిశుభ్రత, పచ్చదనం, అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోందని, త్వరలోనే తన కుటుంబ సభ్యులతో కలిసి మళ్లీ సందర్శిస్తానని పేర్కొన్నారు. గ్రామ పనితీరును అద్భుతంగా అభివర్ణిస్తూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మార్లవాయి ఒక మోడల్ గ్రామంగా నిలిచిందని, ముఖ్యంగా లైబ్రరీ, స్టడీ హాల్, పరిశుభ్రత తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గెడం పార్వతి, గణపత్, గ్రామ పటేల్ అర్జున్, హెడ్ మాస్టర్ పార్వతి, ఉపాధ్యాయులు కనక వెంకటేశ్వరావు, కనక సోనేరావు, నాగేష్, తుకారం, శీను, అమృత్, శంకర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు మూడవ విడతలో అక్రిడేషన్లు ఇవ్వాలి

### - జిల్లా కలెక్టర్, డీపీఆర్ఓ ప్రత్యేక చొరవ చూపాలి: జాయింట్ సెక్రటరీ పురుషోత్తం డిమాండ్

భైంసా, జులై 17, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టులకు మూడవ విడతలో ప్రాధాన్యతనిచ్చి అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పురుషోత్తం డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కలెక్టర్, డీపీఆర్ఓలు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లాలోని ప్రతి ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా జర్నలిస్టులు నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు వార్తలను అందిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు చాలామందికి అక్రిడేషన్ కార్డులు అందకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు మూడవ విడత జాబితాలో తప్పనిసరిగా అక్రిడేషన్ కార్డులు దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పురుషోత్తం స్పష్టం చేశారు.



## విద్యుత్ తీగలకు స్పేసర్లు అమరిక

వేమనపల్లి, జూలై 17, ప్రభాతవార్త



గాలి వీచే సమయంలో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి సరఫరా అంతరాయం ఏర్పడకుండా వేమనపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ శుక్రవారం స్పేసర్లు అమర్చింది. విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ ఆదేశాల మేరకు ఈ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని విద్యుత్ తీగల మధ్య దూరం నిలుపుకునేలా స్పేసర్లు ఏర్పాటు చేయడంతో గాలి ప్రభావం వల్ల తీగలు తగిలే అవకాశాలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైన్మెన్ ఉదయకుమార్, వర్కర్లు రాజ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.



బ్లీచింగ్ పౌడర్ చల్లింపు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ లలిత

## ఇండ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

### - రాజీవ్ నగర్ సర్పంచ్ మామిడాల లలిత

తాండూర్, జూలై 17, ప్రభాతవార్త :

గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ ఇండ్ల చుట్టూ, పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలనిరాజీవ్ నగర్ సర్పంచ్ మామిడాల లలిత అన్నారు. శుక్రవారం పలు కాలనీలోని మురుగు కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లింపు పనులు నిర్వహించారు. ఈ పనులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తగా బ్లీచింగ్ పౌడర్ చల్లింపు పనులు చేపట్టామన్నారు. గ్రామ ప్రజలు పరిశుభ్రత పాటించి గ్రామ పంచాయతీకి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, నాయకులు మామిడాల రాజేశం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## 19న తుడుందేబ్బ, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా కమిటీల పునర్నిర్మాణ సమావేశం

ఆసిఫాబాద్ టౌన్, జులై 17, ప్రభాతవార్త :

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో ఈ నెల 19న తుడుందేబ్బ, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా కమిటీల పునర్నిర్మాణ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తుడుందేబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తుడుందేబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నక విజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్‌తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఆదివాసి హక్కుల రక్షణ, పోడు భూముల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి నూతన జిల్లా కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఆదివాసి సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, జాతి పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆదివాసులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మడపచి భీంరావు, నాయకులు మడవీ పురుషోత్తం, అడ సోమేష్, కాత్లే ఈశ్వర్ పాల్గొన్నారు.



# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూభారతి భూముల సర్వే

### - గ్రామీణ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తాం

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షాగంగాపూర్, డెడ్రా, మాన్కాపూర్ గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్





బజార్‌హత్నూర్, జులై 17, ప్రభాతవార్త:

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి, వ్యవసాయ రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం బజార్‌హత్నూర్ మండలంలోని గంగాపూర్ గ్రామంలో భూభారతి భూముల సర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం డెడ్రా, మాన్కాపూర్ గ్రామాల్లో పర్యటించారు. గంగాపూర్ గ్రామానికి చేరుకున్న కలెక్టర్ మొదట హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గతంలో 1934లో సర్వే జరిగిందని, మళ్లీ ఇప్పుడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాల ద్వారా భూభారతి రీసర్వే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలోని మొత్తం 509 గ్రామాలకు గాను, మొదటి విడతగా 70 గ్రామాలలో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో నక్ష, రికార్డులు లేని నాన్‌కాడస్ట్రల్ గ్రామాలలో మూడు నాలుగు నెలల క్రితమే ఈ సర్వేను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ రీసర్వే ద్వారా గ్రామ సరిహద్దులను నిర్ణయించిన అనంతరం, వ్యవసాయ, వ్యవసాయేతర భూములను సర్వే చేసి డిజిటలైజ్ చేస్తామని స్పష్టం చేశారు. దీని ఆధారంగా ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తరహాలోనే భూములకు భూదార్ కార్డ్ అందజేస్తామన్నారు. దీనివల్ల భవిష్యత్తులో భూముల రిజిస్ట్రేషన్లు, కొనుగోళ్లు, అమ్మకాలు పారదర్శకంగా జరుగుతాయని, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదవుతున్నందున, రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. భూమిలో తేమను నిలిపి ఉంచడానికి మల్చింగ్ పద్ధతిని ఉపయోగించాలని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి, 2 శాతం ఫోలియర్ స్ప్రే చేయాలని సూచించారు. వర్షాలు లేని పక్షంలో ప్రత్యామ్నాయంగా కందులు, పెసర్లు, మినుములు వంటి తక్కువ నీటితో పండే పంటల వైపు వెళ్లి పంట మార్పిడి చేసుకోవాలని ఉద్ఘాటించారు. వి.బి.జి.రాంజీ స్కీమ్ కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. భూ సర్వే సమయంలో రైతులు తమ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించి అధికారులకు సహకరించాలని కోరారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ సౌద్ పంటల సాగు పద్ధతులు, యూరియా బుకింగ్ విధానంపై రైతులకు వివరించారు. డెడ్రా, మాన్కాపూర్ గ్రామాల్లో పర్యటమండల పరిధిలోని డెడ్రా, మాన్కాపూర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి స్థానిక సమస్యలపై సమీక్షించారు. అటవీ శాఖ అనుమతులు వచ్చినందున ఐటీడీఏ ద్వారా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పునఃప్రారంభిస్తామని, వీబీజీ రాంజీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల విడుతలలో మాన్కాపూర్ గ్రామంలోని గుడిసె నివాసితులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. రైతుల సాగునీటి అవసరాల కోసం బోరు, బావి సౌకర్యం ఉన్న వారికి అటవీ శాఖ అనుమతులతో త్రీఫేజ్ విద్యుత్ అందిస్తామన్నారు. రైతులు గ్రూప్‌గా ఏర్పడి రూ. 9,150 చెల్లిస్తే, కిలోమీటర్ పరిధి వరకు 20 స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉచితంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించి, గురుకుల ప్రవేశ పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. అనంతరం మాన్కాపూర్ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బోధన కోసం సర్వే శాఖ ఏడీ ప్రభాకర్ తన సొంత నిధులతో అందించిన స్మార్ట్ టీవీని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. విద్యాభివృద్ధికి కృషి చేసిన ఏడీ ప్రభాకర్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. పర్యటనలలో తహసీల్దార్ శ్యామ్ సుందర్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్, సర్పంచ్‌లు సుభాష్, విజయ, అనిల్, ఏఓ సౌద్, ఏఈఓ ప్రవీణ్, ఉపాధ్యాయుడు దేవ్ రావ్, స్థానిక రైతులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మార్కెట్ చైర్మన్ జన్మదిన వేడుకల్లో రక్తదాన శిబిరం

### - ముఖ్య అతిథిగా హాజరై అబ్దుల్ ఆదిని సత్కరించిన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కూచడి శ్రీహరి రావు

### - వనమహోత్సవంలో భాగంగా జడ్పీఎస్ఎస్ పాఠశాలలో మొక్కలు నాటిన నాయకులు

సారంగాపూర్, జులై 17, ప్రభాతవార్త:



సారంగాపూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది 48వ జన్మదిన వేడుకలు మండలంలోని స్వర్ణ గ్రామంలో గల అర్ఫా గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచడి శ్రీహరి రావు ముఖ్య అతిథిగా హాజరై చైర్మన్ అబ్దుల్ ఆదికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూచడి శ్రీహరి రావు చేతుల మీదుగా వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తన పుట్టినరోజు పురస్కరించుకుని రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువకులకు, వేడుకలకు హాజరైన నాయకులకు, అభిమానులకు మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా స్వర్ణ జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో కూచడి శ్రీహరి రావు కాంగ్రెస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ చైర్మన్ సోమ భీమారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొట్టే శేఖర్, భూరాజ్, నిర్మల్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్, సారంగాపూర్ మాజీ మార్కెట్ చైర్మన్లు రాజ్ మహమ్మద్, శ్రీనివాసరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు పట్ల పోతారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విలాసరావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాక్ పెళ్ళి సురేందర్, మార్కెట్ డైరెక్టర్లు కొత్తకాపు పోతారెడ్డి, సుభాష్ రెడ్డి, ముత్యం రెడ్డి, అహమ్మద్, ముక్తార్, ప్రశాంత్, నాయకులు మధుకర్, రవీందర్ రెడ్డి, దాసరి రమేష్, సోయల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వందమఱ్రి, జూలై 17, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డులో మందమఱ్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డిలతో కలిసి, మందమఱ్రి మున్సిపాలిటీలోని 19వ వార్డులో మండల తహసిల్దార్‌తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం ఆగస్టు 3వ వరకు పొడిగించిందని, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు అధికారులకు సహకరించాలని తెలిపారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని, అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియట్‌కు ఆధునికరించడం జరిగిందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తక్కువ నీటి అవసరమున్న పంటల సాగుపై రైతులకు అవగాహన

**సిర్పూర్(టి), జూలై 17, ప్రభాతవార్త :**

ఎల్‌నినో ప్రభావంతో జూలై–ఆగస్టు నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమున్న పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి బుక్య గిరిషన్ సూచించారు. శుక్రవారం సిర్‌పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ 2026 అత్యవసర (కాంటింజెన్సీ) పంటల ప్రణాళికపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మాత్రమే వరి సాగు చేపట్టాలని, వర్షాధార ప్రాంతాల్లో వరి సాగును నివారించాలని సూచించారు. కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, జొన్న, సజ్జ, కొర్రలు, నువ్వులు, పల్లీలు, సూర్యకాంతి, అలాగే కూరగాయలు, తోట పంటల సాగు రైతులకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఆగస్టు 15 వరకు పత్తి, కంది, పెసర వంటి పంటలు, అనంతరం నువ్వులు, జొన్న, సజ్జ తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. అలాగే విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, నేల ప్రతీ స్థాయి, ఇతర సాంకేతిక అంశాలపై రైతులకు వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ అత్యవసర పంటల ప్రణాళికను అనుసరించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) లేదా సిర్‌పూర్(టి) మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవికుమార్, లోనవెల్లి సర్పంచ్ సంతోష్, ఉపసర్పంచ్ సతీష్, రైతులు పాల్గొన్నారు.



# మంచిర్యాల జిల్లా రివ్యూ మీటింగ్‌లో ఎస్సీ, ఎస్టీ సమస్యలపై సమగ్ర చర్చ



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 17, ప్రభాతవార్త :**

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రోజున నిర్వహించిన కీలక రివ్యూ మీటింగ్‌లో జిల్లా అభివృద్ధి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ అగ్గడి భాస్కర్, అదనపు కలెక్టర్లు చంద్రయ్య, రాములు, మనోజ్, జిల్లా ఉన్నతాధికారులు, డివిఎంసి సభ్యులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, కురుసం నీలాదేవి, రాంబాబు నాయక్ పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యంగా రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పెద్ద ఎత్తున వచ్చిన వినతులను పరిశీలించారు. ఫారెస్ట్ అధికారులు రైతులను వేధిస్తున్నారనే అంశంపై కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా హైపవర్ కమిటీ ఏర్పాటు చేసి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని కమిషన్ హామీ ఇచ్చింది. అట్రాసిటీ కేసుల నమోదు, పరిహారం చెల్లింపుల్లో ఉన్న పెండింగ్ అంశాలపై కూడా చర్చ జరిగింది. ఇప్పటికే మంజూరైన పరిహారాలను త్వరితగతిన బాధితులకు అందించేలా ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కలెక్టర్‌ను కమిషన్ కోరింది. అలాగే అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యం వహించవద్దని పోలీస్ అధికారులకు సూచించింది. ఉద్యోగావకాశాల విషయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ అమలు బలోపేతం చేయాలని, అవుట్‌సోర్సింగ్ నియామకాలలో కూడా వారికి ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న 60 సంవత్సరాలు పూర్తి చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించడంతో పాటు, వారికి పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అందించాలని ప్రతిపాదించారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో ఇళ్లు, రహదారులు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దరఖాస్తులు చేసిన వారికి అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. అదనంగా, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, విద్యా మరియు వైద్య రంగాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ కలెక్టర్‌ను కోరింది.

# బెల్లంపల్లిలో 20 నుంచి డిగ్రీ ప్రత్యేక విడత అడ్మిషన్లు ప్రారంభం

## - 26 వరకు రిజిస్ట్రేషన్లు.. 27 వరకు వెబ్ ఆప్షన్లు

**బెల్లంపల్లి, జూలై 17, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ ప్రత్యేక (చివరి) విడత అడ్మిషన్లు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దోస్త్ అడ్మిషన్ ప్రక్రియలో ఇప్పటికే మూడు విడతలు పూర్తయ్యాయని, ఇంకా సీట్లు పొందలేని విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక విడతను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ప్రత్యేక విడతలో భాగంగా ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయని, 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో దోస్త్ వాలంటరీ హెల్ప్‌లైన్ సెంటర్ అందుబాటులో ఉండటంతో విద్యార్థులు నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందన్నారు. ఈ నెల 30వ తేదీన సీట్ల కేటాయింపు (సీట్ అలాట్మెంట్) జరగనుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధిని దృష్టిలో ఉంచుకుని కళాశాలలో ఐదు ఏఈడిపి కోర్సులను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కోర్సుల్లో చేరిన వారికి మొదటి రెండు సంవత్సరాలు సాధారణ తరగతులు నిర్వహించి, చివరి సంవత్సరంలో స్టైఫండ్‌తో కూడిన ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కళాశాల పూర్తి బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కళాశాలలో బీఏ ఆనర్స్, బీకాం బీఎఫ్ఎస్ఐ, బీకాం ఈకామర్స్, బీఎస్సీ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్, బీఎస్సీ హార్టికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్ వంటి ఏఈడిపి కోర్సులతో పాటు బీఏ సిబిసిఎస్, బీకాం టాక్సేషన్, బీకాం సీఏ, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ బిజెడ్‌సి వంటి ఇతర డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని వదులుకోకుండా వెంటనే నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9959269975 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

# బెల్లంపల్లిలో మహమ్మద్ ఖాసీం బస్తీలో స్క్రాప్ దుకాణం తొలగింపు

**బెల్లంపల్లి, జూలై 17, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపాలిటీ కాంటా ఏరియాలోని మహమ్మద్ ఖాసీం బస్తీలో అనధికారంగా నడుస్తున్న స్క్రాప్ దుకాణంపై మున్సిపాలిటీ అధికారులు కఠిన చర్యలు చేపట్టి ఈ రోజు పూర్తిగా తొలగించారు. ఈ దుకాణం కారణంగా స్థానికులకు తీవ్ర అసౌకర్యాలు కలగడంతో పాటు రహదారి రాకపోకలు దెబ్బతినడం, చెత్త పేరుకుపోవడం వల్ల ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పలుమార్లు ప్రజలు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో మున్సిపాలిటీ ముందుగా దుకాణ యజమానికి నోటీసులు జారీ చేసినప్పటికీ ఎలాంటి మార్పు లేకపోవడంతో అధికారులు రంగంలోకి దిగి యంత్రాంగంతో కలిసి దుకాణాన్ని తొలగించారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ హెచ్చరిస్తూ పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న మిగిలిన అక్రమ స్క్రాప్ దుకాణాలపై కూడా త్వరలోనే ఇదే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ నిచల్, ఆర్వో భుజంగరావు, వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. సునీల్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం: గౌతం చారి

**మందమఱ్రి, జూలై 17, ప్రభాతవార్త**

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320జీ ఆధ్వర్యంలో మందమఱ్రి పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రెస్ క్లబ్‌కు మూడు సిమెంట్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సేవా కార్యక్రమాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ సొత్తుకు సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు లయన్ పెండ్యాల గౌతం చారి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా 210కి పైగా దేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ లయన్స్ క్లబ్ అని తెలిపారు. సమాజ సేవే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. మందమఱ్రి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీల ఏర్పాటు, ఉచిత కంటి వైద్య శిబిరాలు, కంటి శస్త్రచికిత్సలు, అన్నదాన కార్యక్రమాలు, స్థానికులకు ఉచిత షుగర్, రక్తపోటు పరీక్షలు వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, మరణానంతరం కంటి దానం చేయడం ద్వారా చూపు లేని వారికి వెలుగునివ్వవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ జాకీర్, కోశాధికారి లయన్ బుర్ర ఆంజనేయులు, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ తౌటం శ్రీను, డైరెక్టర్లు లయన్ బింగి రాజన్న, లయన్ కొక్కుల మధు, లయన్ తాడికొండ లూథర్, లయన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావంతో తక్కువ నీటి పంటల వైపు మళ్లాలి

**- ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలతో జలసిరి పటిష్టం చేయాలి**

**- ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు ఆగస్టు 3 వరకు పొడిగింపు: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**



**నిర్మల్, జులై 17, ప్రభాతవార్త:**

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు నీటి లభ్యత ఆధారంగానే పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని, భూగర్భ జలాల పరిరక్షణకు చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, జల సంరక్షణ చర్యలు, ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నీనో ప్రభావంతో జూలైలో జిల్లాలో 30 శాతం వర్షపాత లోటు నమోదైందని, సోన్ మండలంలో 50 శాతం వరకు వర్షాభావం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 4.30 లక్షల ఎకరాల్లో పంటలు కొనసాగుతున్నాయని తెలిపారు. నీటి లభ్యతను అంచనా వేసిన తర్వాతే వరి నాట్లు వేయాలని రైతులకు సూచించారు. సాగునీరు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా కంది, ఆయిల్‌పామ్, కూరగాయలు, ఉద్యానవన పంటలు సాగు చేయాలని కోరారు. ఒక ఎకరం కందిలో 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, దీంతో రైతులు మంచి ఆర్థిక లాభం పొందుతారని చెప్పారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం గతంలో 400 ఎకరాల నుంచి ఈ ఏడాది 1,200 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటల సాగుకు అవకాశం ఉండటంతో పాటు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందన్నారు. పందిరి కూరగాయల సాగుకు 50 శాతం రాయితీ, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు వివరించారు. రైతుల సలహాలు, సందేహాల నివృత్తి కోసం 89777 51785 హెల్ప్‌లైన్ నంబరు అందుబాటులో ఉంచామన్నారు. తెలంగాణ జలసిర్తితో భూగర్భ జలాల పెంపు ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత, ప్రతి పొలానికి ఒక ఫామ్ పాండ్ లక్ష్యంతో తెలంగాణ జలసిరి కార్యక్రమం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. 8 8, 16 16, 20 20 పరిమాణాల్లో ఫామ్ పాండ్లు నిర్మించడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించవచ్చన్నారు. బోర్‌వెల్‌ల వద్ద రీచార్జ్ పిట్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోందని, విబిజి రామ్‌జీ పథకం కింద ఫామ్ పాండ్లకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖలు సమన్వయంతో గ్రామస్థాయిలో రైతులకు పంట మార్పిడి, నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 3 వరకు ఎస్ఐఆర్ గడువు పొడిగింపుఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రభుత్వం ఆగస్టు 3 వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం డిజిటలైజేషన్, అన్‌కలెక్టెడ్ ఫారాలతో కలిపి 81 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన ఫారాలను బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, సర్పంచ్‌ల సమన్వయంతో గడువులోపు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, జిల్లా పౌరసంబంధాల అధికారి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలించిన కౌన్సిలర్ లావణ్య

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 17, ప్రభాతవార్త :**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని 8వ వార్డులో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కౌన్సిలర్ గజ్జల లావణ్య లక్ష్ముుుు ్మణ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో ఇంకా ఎవరైనా ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించకపోతే వెంటనే సమర్పించాలని సూచించారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు తప్పనిసరిగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎవరూ మిగిలిపోకుండా బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, కాలనీవాసులు, స్థానికులు పాల్గొన్నారు.

## నేడు మున్నూరు కాపు సంఘం తాలూకా కార్యవర్గాల ఎంపిక

**కాగజ్‌నగర్‌రూరల్, జూలై 17, ప్రభాతవార్త :**

తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆధ్వర్యంలో సిర్పూర్ తాలూకా కార్యవర్గం, తాలూకా మహిళా కార్యవర్గం ఎంపిక కార్యక్రమాన్ని శనివారం ఉదయం 11 గంటలకు కాగజ్‌నగర్‌లోని బట్‌పెల్లి చౌరస్తా సమీపంలోని పటేల్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌటాల, బెజ్జూర్, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్, దహెగాం మండలాలకు చెందిన మున్నూరు కాపు సోదరులు, సోదరీమణులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సంఘం బలోపేతం, ఐక్యత, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి తాలూకా స్థాయి కమిటీలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు అందించాలని గజ్జల లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.

## నిర్మల్‌లో ఉద్యోగ మేళాకు భారీ స్పందన

**- 60 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్**

**- నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు**

**జిల్లా ఉపాధి కల్పనా అధికారి విజయలక్ష్మి**

**నిర్మల్, జులై 17, ప్రభాతవార్త:**

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ మేళాలో స్వతంత్ర మైక్రోఫిన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పాల్గొని అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఉద్యోగ మేళాకు 100 మందికి పైగా యువతీయువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనా అధికారి విజయలక్ష్మి వివరాలు వెల్లడిస్తూ.. మొత్తం 80 మంది అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూల్లో పాల్గొనగా, వారి ప్రతిభ ఆధారంగా 60 మందిని కంపెనీ షార్ట్‌లిస్ట్ చేసిందని తెలిపారు. తుది ఎంపిక ఫలితాలను సదరు సంస్థ త్వరలోనే ప్రకటిస్తుందని వెల్లడించారు. నిరుద్యోగ యువత ఇలాంటి ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. జిల్లాలో నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని మేళాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.




## భూ భారతి పునఃసర్వేపై గ్రామసభలకు షెడ్యూల్ విడుదల

**సిర్పూర్(టి), జూలై 17, ప్రభాతవార్త :**

భూ భారతి భూముల పునఃసర్వే (రీ సర్వే) కార్యక్రమంలో భాగంగా సంబంధిత గ్రామాల్లో గ్రామసభల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు జూలై 14న సంబంధిత గ్రామపంచాయతీలు, ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్లలో గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రచురించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం జూలై 18న ఉదయం 11 గంటలకు చింతకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో చింతకుంట, చించుపల్లి, హిరాపూర్ గ్రామాలకు గ్రామసభ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు భూపాలపట్నం గ్రామపంచాయతీ కార్యాలయంలో బొంకి గ్రామానికి గ్రామసభ ఏర్పాటు చేశారు. జూలై 20న ఉదయం 11 గంటలకు మేడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గర్లపేట్ గ్రామానికి, మధ్యాహ్నం 12 గంటలకు హుడికిలి గ్రామపంచాయతీ కార్యాలయంలో జక్కాపూర్ గ్రామానికి, మధ్యాహ్నం 3 గంటలకు లక్మీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో టోకిని గ్రామానికి, మధ్యాహ్నం 4 గంటలకు వెంకట్రావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో వెంకట్రావుపేట గ్రామానికి గ్రామసభలు నిర్వహించనున్నారు. గ్రామసభలకు ఎంపీడీవో, పోలీసు శాఖ అధికారులు, మండల సర్వేయర్, గిర్దావర్, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత గ్రామాల సర్పంచులు, రైతులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

## నీట్‌లో జైనూర్ విద్యార్థిని సత్తా..

**- 451 మార్కులతో ప్రతిభ చాటిన సుమయ ఫాతిమా**

**- వైద్య విద్య సాధనే లక్ష్యంగా ముందడుగు**



**జైనూర్, జూలై 17, ప్రభాతవార్త:**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని సుమయ ఫాతిమా నీట్-2026 ఫలితాల్లో 451 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. మారుమూల ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించడం పట్ల స్థానికులు, విద్యావేత్తలు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. సుమయ ఫాతిమా ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు జైనూర్‌లోని కేరళ గ్రామర్ పాఠశాలలో విద్యనభ్యసించింది. అనంతరం పదో తరగతిని ఆదిలాబాద్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పూర్తి చేసి, ఇంటర్మీడియట్‌ను చైతన్య జూనియర్ కళాశాలలో చదివింది. వైద్య విద్యనభ్యసించడమే లక్ష్యంగా నీట్-2026 పరీక్షకు హాజరైన ఆమె 451 మార్కులు సాధించడంతో ఎంబీబీఎస్ సీటు సాధించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జైనూర్ వంటి మారుమూల ప్రాంతం నుంచి నీట్‌లో ప్రతిభ చాటిన సుమయ ఫాతిమాను స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**- భూగర్భ జలాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి**

**- అధికారులకు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశం**

**నిర్మల్, జులై 17, ప్రభాతవార్త:**



జిల్లాలో వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. భూగర్భ జలాల సంరక్షణ కోసం ఫామ్ పాండ్లు, రెయిన్ వాటర్ రీచార్జింగ్ నిర్మాణాలను పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, భూగర్భ జలాల సంరక్షణ చర్యలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాల వారీగా ఇండ్ల నిర్మాణాల పురోగతి, లబ్ధిదారులకు అందించిన ఆర్థిక సహాయం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓలు ప్రతిరోజూ పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష జరపాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. భూగర్భ జలాల పెంపులో భాగంగా జిల్లాలో ఫామ్ పాండ్లు, రెయిన్ వాటర్ రీచార్జింగ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రెయిన్ వాటర్ రీచార్జింగ్ నిర్మాణాల ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్.సి., ఎస్.టి.ల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

## - రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




**నస్పూర్, జూలై 17, ప్రభాతవార్త**

జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్ల శంకర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి ఎస్.సి., ఎస్.టి. లకు సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం, ఎస్.సి., ఎస్.టి. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలవారికి రాజ్యాంగం కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ వారి సంక్షేమ, అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 56 వేల 969 మంది షెడ్యూల్డ్ తెగలు, 1 లక్ష 99 వేల 493 మంది షెడ్యూల్డ్ కులముల వారు ఉన్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం సంక్షేమ పథకాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, దుప్పట్లు, బంకర్ బెడ్స్ సమకూర్చడం జరుగుతుందని, వసతి గృహాలు, గురుకులాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని, సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ క్రింద నిధుల కేటాయింపు జరుగుతుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఎస్.సి., ఎస్.టి. లకు పని కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 20 లక్షల రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, అంగన్వాడి, గ్రామపంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించడం అభినందనీయమని, తద్వారా కేసులు తగ్గుముఖం పట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. 1 వేయి కంటే ఎక్కువగా కేసులు నమోదు అయిన జిల్లాలలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని, మంచిర్యాల జిల్లాలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం గ్రామాలలో సభలు నిర్వహించి అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు నిబంధనలకు లోబడి పట్టాలు జారీ చేసే విధంగా రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సర్వే చేయాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతిలో రోస్టర్ పద్ధతిని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో బెల్ట్ షాపులపై ఆబ్కారీ మధ్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపాలిటీలలో ఎస్.సి., ఎస్.టి. పొరుగు సేవల ఉద్యోగులు, సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని, పి.ఎఫ్. అమలు, భీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, తెగల ప్రజలు నివసిస్తున్న గ్రామాలకు రహదారి సౌకర్యం, త్రాగునీటిని అందించాలని, అట్రాసిటీ కేసులను త్వరగా విచారించి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని, అట్రాసిటీ బాధితులకు త్వరగా పరిహారం అందించాలని తెలిపారు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలను ప్రోత్సహించాలని, ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో ఎస్.సి., ఎస్.టి. విద్యార్థుల ప్రవేశాల దృష్ట్యా పాఠశాలలకు చెల్లించవలసిన బకాయిలు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, విదేశీ విద్య ఉపకార వేతనాలు, ఇతర రంగాలకు సంబంధించిన అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగలు, కులముల వారి అభివృద్ధి, సంక్షేమానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, దుర్గ మల్లయ్య, పెద్ది రాజన్న, పౌర సరఫరాల కమిటీ సభ్యులు జిల్లపల్లి వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలి

## - నామినేటెడ్ విధానంలో సామాజిక న్యాయం పాటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పేరం అలేఖ్య విజ్ఞప్తి

**మంచిర్యాల, జూలై 17, ప్రభాతవార్త**

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్మన్, డైరెక్టర్ పదవులను నామినేటెడ్ విధానంలో భర్తీ చేయనున్న నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది పేరం అలేఖ్య ప్రభుత్వాన్ని కోరారు. నామినేటెడ్ విధానంలో నియామకాలు చేపట్టినా సామాజిక న్యాయం, సమాన అవకాశాల సూత్రాలను పాటించి అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆమె అన్నారు. రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఆర్థికంగా బలమైన వారికే పదవులు పరిమితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగేలా రిజర్వేషన్ల ప్రకారం నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆమె విజ్ఞప్తి చేశారు.



# ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను నియమించాలి

## - బజార్హత్నూర్ పీహెచ్సీలో వైద్యుల కొరతపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ

## - రెండు రోజుల్లో వైద్యులను నియమిస్తామని కలెక్టర్ రాజర్షి షా హామీ

**బజార్హత్నూర్, జులై 17, ప్రభాతవార్త:**

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్సీ) ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని బజార్ హత్నూర్ సర్పంచ్ సాయన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కోరారు. శుక్రవారం మండలంలోని గంగాపూర్ గ్రామానికి వచ్చిన కలెక్టర్‌ను సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయన్న మాట్లాడుతూ.. మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు బజార్ హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే ప్రధాన ఆధారామని తెలిపారు. నిబంధనల ప్రకారం ఈ పీహెచ్సీలో నలుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఒక్క వైద్యుడు కూడా అందుబాటులో లేకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ, గిరిజన నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రెండు రోజుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యులను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు డి. చంద్రశేఖర్, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

**హాజీపూర్, జూలై 17, ప్రభాతవార్త**



హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ ఆత్మహత్య యత్నానికి ప్రయత్నిస్తుండగా స్థానిక ఎస్సై కిరణ్ కుమార్ చొరవతో ఆమె ప్రాణాలను రక్షించడం జరిగింది. మందమరి మండలం మేడారం గ్రామానికి చెందిన ఓ మహిళ మంచిర్యాల శివారులోని ముల్కల పుష్కర ఘాట్ వద్ద గల గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసేందుకు ప్రయత్నించింది. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎస్సై వెంటనే బ్లూ కోర్టు సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించడం జరిగింది. అట్టి మహిళను రక్షించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఆత్మహత్యకు గల కారణాలతోపాటు సంబంధిత వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం జరిగింది. పోలీసుల సమయస్ఫూర్తిని పలువురు అభినందించారు.

# గోదావరి నీళ్లతో అమ్మవార్లకు జలాభిషేకం

## - వానదేవుడా కరుణించు దేగాంలో రైతుల ప్రత్యేక పూజలు - వర్షాలు లేక ఎండిపోతున్న పంటలను కాపాడాలని వేడుకోలు



**భైంసా, జులై 17, ప్రభాతవార్త:**

వర్షాలు కురవక పంటలు ఎండిపోతుండటంతో వర్షం కోసం రైతులు అమ్మవార్లను వేడుకున్నారు. భైంసా మండలంలోని దేగాం గ్రామంలో నెల రోజులు కావస్తున్నా వర్షాలు పడకపోవడంతో రైతులు సాగు చేసిన సోయాబీన్, పత్తి పంటలతో పాటు వరి నారుమడులు ఎండిపోతున్నాయి. దీంతో గ్రామ రైతులు, గ్రామస్థులు కలిసి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ గ్రామదేవతలు, మహా పోచమ్మ అమ్మవార్లకు గోదావరి జలాలతో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ముందుగా భజన బృందాలు, బాజాభజంత్రీలతో సంప్రదాయబద్ధంగా గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లిన రైతులు, గ్రామ పెద్దలు నదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడ నుంచి గోదావరి జలాలను తీసుకువచ్చి సరస్వతి అమ్మవారి ఆలయంతో పాటు గ్రామదేవతలు, పెద్దమ్మ తల్లి, పోచమ్మ ఆలయాల్లో విశేష జలాభిషేకాలు నిర్వహించారు. పంటలను కాపాడేలా సమృద్ధిగా వర్షాలు కురిపించాలని వరుణదేవుడిని, అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వీడీసీ సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.